సాక్షి చిత్తూరు

మంగళవారం । 15 । అక్టోబర్ । 2024




పంటలపై ఏనుగుల దాడి

అయ్యావాండ్లపల్లె పంచాయతీలో సోమవారం తెల్లవారు జామున పంటలపై ఏనుగులు దాడి చేశాయి. - 8లో



ముందస్తు ఏర్పాట్లు సిద్ధం

భారీ వర్షాల హెచ్చరికతో సహాయక చర్యలకు ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. - 8లో



ఊరిస్తోంది!

ఆ పల్లె పేరుకే పరిమితం.. ఊరే ఉండదు.. ప్రజాప్రతినిధులంతా పక్క ఊరి వారే.. పాలనా పొరుగునే..చరిత్రలో పేరు చెరగలేదు. - 8లో

న్యూస్‌రీల్

17న పలమనేరులో ఉద్యోగమేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పలమనేరు ఎస్వీసీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 17వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడప్, డీఆర్‌డీఏలు సంయుక్తంగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగమేళాలో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యనభ్యసించిన అభ్యర్థులు ఉద్యోగమేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. 18-35 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలన్నారు. జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు ఈ ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 84658 30771, 99635 61755 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు, రేపు పాఠశాలలకు సెలవు

– డీఈఓ దేవరాజు

చిత్తూరు కలెక్టరేట్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా అధిక వర్షాలు కురవనున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15, 16 తేదీల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తున్నట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాతావరణశాఖ, విపత్తు నిర్వహణ శాఖల హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు సెలవు ప్రకటించినట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు తప్పనిసరిగా సెలవు ఆదేశాలు అమలు చేయాలన్నారు. నిబంధనలను వ్యతిరేకించి ఎవరైనా పాఠశాలలు నిర్వహిస్తే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఏదైనా నష్టం వాటిల్లితే వెంటనే వివరాలను ఎంఈఓలు, డీఈఓ, సమగ్రశిక్ష శాఖ ఏపీసీ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

గిరిజన అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ పరీక్షకు సన్నద్ధం అవుతున్న గిరిజన అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డీఎస్సీ నోటిఫికేషన్‌ను అనుసరించి మూడు నెలల పాటు ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన శిక్షణ సంస్థల్లో ఉచిత భోజనం, వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకు జిల్లాలో ఆసక్తి ఉన్న అభ్యర్థులు జ్ఞానభూమి.ఏపీ.జీవోవీ.ఇన్ (www.jnanabhumi.ap.gov.in) వెబ్ సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 21 తుది గడువు అని చెప్పారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఈ నెల 27 వ తేదీన స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందన్నారు. హాల్‌టికెట్‌లను ఈ నెల 22 వ తేదీ నుంచి 25 వ తేదీ వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. స్క్రీనింగ్ పరీక్ష అనంతరం ఈ నెల 28 వ తేదీన ఎంపిక జాబితా విడుదల చేస్తారన్నారు. ఈ ఎంపిక ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారని తెలిపారు. ఏవైనా సందేహాలున్నట్‌లైతే కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కొందరికే కిక్కు లక్కు..!

దరఖాస్తుదారులు కోకొల్లలు.. కొందరినే వరించిన భాగ్యం.. కిక్కు లక్కు దక్కిన వారిలో ఆనందం.. మిగిలిన వారందరికీ చేజారిపోయిన ధనం.. శూన్యహస్తం.. ఉసూరోమని తిరుముఖం.. ఎట్టకేలకు ముగిసిన కేటాయింపు.. ఇక మిగిలింది ఊరూరా మద్యధార.. ఇదీ జిల్లాలో సోమవారం లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాల కేటాయింపులో విచిత్రం.

- జిల్లాలో పూర్తయిన మద్యం దుకాణాల కేటాయింపు
- కలెక్టర్, ఎస్పీ సమక్షంలో లాటరీ ద్వారా దుకాణాలు
- జిల్లాలో మహిళలకు 12 మద్యం దుకాణాలు
- రేపటి నుంచి 104 ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం
- తొలి విడతగా ప్రభుత్వానికి రూ.105 కోట్ల రాబడి



చిత్తూరులో మద్యం దుకాణాలకు లాటరీ తీస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన ఎస్పీ, ఎక్సైజ్ డీసీ

చిత్తూరు అర్బన్: మద్యం దుకాణాల కేటాయింపునకు నిర్వహించిన లాటరీ ప్రక్రియ ముగిసింది. కిక్కు కోసం లక్కును పరీక్షించుకుని దుకాణాలు వచ్చిన వాళ్లు కొందరైతే.. పదుల సంఖ్యలో టెండర్లు వేసి చేతిలో ఉన్న కాసులు పోగొట్టుకున్నవాళ్లు మరికొందరు. ఇక అసలైన ఆటలో భాగంగా ప్రైవేటు దుకాణాల్లో మద్యం ఏరులై పారడమే తరువాయి. ఈసారి 12 మంది మహిళలు సైతం మద్యం దుకాణాలు దక్కించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 104 మద్యం దుకాణాల లైసెన్సుల జారీ కోసం చిత్తూరులోని ఆర్ ఆర్ గార్డెన్‌లో సోమవారం లాటరీ పద్ధతిలో జరిగిన దుకాణాల కేటాయింపు ప్రక్రియ నిర్వహణ సజావుగా ముగిసింది. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, ఎక్సైజ్ డీసీ విజయశేఖర్, ఈఎస్ శ్రీనివాస్‌ల సమక్షంలో లాటరీ ప్రక్రియ కొనసాగింది. ఉదయం నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సాగింది. దుకాణాలు వచ్చిన వారు మొత్తం లైసెన్సు రుసుములో ఆరో వంతు అప్పటికప్పుడే ఎక్సైజ్ అధికారుల వద్ద చెల్లించాలనే నిబంధన ఉండటంతో రాత్రి 8 గంటల వరకు సైతం వ్యాపారులు నగదు చెల్లింపులు కొనసాగించారు.

మహిళలకూ దుకాణాలు..

మరోవైపు జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాల నిర్వహణ కోసం మహిళలు కూడా పోటీపడ్డారు. 58 దుకాణాలకు మహిళల పేరిట దరఖాస్తులు వచ్చి పడ్డాయి. లాటరీ పద్ధతిలో లైసెన్సుదారులను ఎంపిక చేసే ప్రక్రియలో మహిళలను సైతం అదృష్టం వరించింది. చిత్తూరు అర్బన్‌లో పి.యామిని, టి.కీర్తన, కె.పల్లవి, ఐరాలలో ఎస్.లక్ష్మి, వెదురుకుప్పంలో పార్వతి, శాంతమ్మ, విజయపురంలో భారతీ ప్రభాకరన్, బైరెడ్డిపల్లెలో ఎస్.భారతి, గుడుపల్లెలో ఈఎస్.ప్రభావతి, శాంతిపురంలో ఎన్.పుష్ప, రామకుప్పంలో ధనలక్ష్మి, పులిచెర్లలో వి.సరస్వతి అనే మహిళలకు మద్యం దుకాణాల రూపంలో లక్కు దక్కింది.

రేపటి నుంచి దుకాణాలు..

లైసెన్సులు దక్కించుకున్న వ్యాపారులు బుధవారం నుంచి జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభించనున్నారు. దుకాణాల ఏర్పాటులో గతంలో ఉన్న నిబంధనలను తొలగించి.. ఇపుడు మండలం లేదా మునిసిపాలిటీ యూనిట్‌గా నిర్ణయించడంతో మద్యం షాపులు ఎక్కడైనా పెట్టుకోవచ్చు. ఓ మండలానికి మూడు దుకాణాలు కేటాయిస్తే, మూడు కూడా పక్కపక్కనే పెట్టుకోవచ్చని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఒక్క అంశమే వ్యాపారుల మధ్య సిండికేట్‌ను ప్రోత్సహించడం, అధికారపార్టీ నేతలు పంచాయతీ చేయడానికి వెలుసుబాటు కల్పించింది.



మద్యం దుకాణాల కోసం హాజరైన మహిళలు

బోణీ బాగుంది..

104 దుకాణాలకు 2,266 దరఖాస్తులు రాగా, నాన్ రీ-ఫండబుల్ కింద ఒక్కో దుకాణానికి రూ.2 లక్షల ఫీజును చెల్లించాలనే నిబంధనలతో మద్యం వ్యాపారం కోసం తొలిగా రూ.22.66 కోట్లు చెల్లించారు. ఇందులో 104 మందికి దుకాణాలు రావడంతో రూ.2 లక్షలను లైసెన్సు ఫీజు నుంచి మినహాయించుకుంటారు. మిగిలిన 2,162 మంది రూ.43.24 కోట్లు మద్యం దరఖాస్తుల రుసుము ద్వారా పోగొట్టుకోవడం, దాన్ని ప్రభుత్వం కైవసం చేసుకోవడం జరిగిపోయింది. ఇక దుకాణాలు దక్కించుకున్నవారు లైసెన్సు రుసుములో ఆరో వంతు కింద తొలి విడతగా రూ.62.40 కోట్ల వరకు నగదు లాటరీ తీసిన ప్రదేశంలోనే అధికారుల వద్ద జమ చేశారు. ఈ లెక్కన తొలి విడతగా ప్రభుత్వానికి మద్యం వ్యాపారుల నుంచి రూ.105 కోట్ల పైనే ఆదాయం లభించింది.

‘లక్కు’లో విశేషాలు..

- చిత్తూరు అర్బన్‌కు సంబంధించి తీసిన తొలి లాటరీలో మొదటి షాపు జెఎం.ప్రసన్నకుమార్ అనే వ్యక్తికి దక్కించుకున్నాడు. ఇతనికే యాదమరిలోని మరో దుకాణం కూడా రావడం విశేషం.
- పాలసముద్రంలో ఒక్క దుకాణం నిర్వహణకు ఏకంగా 82 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో ఓ దుకాణానికి ఇన్ని దరఖాస్తులు రావడం ఇదే ప్రప్రథమం. అధికారులు లాటరీ నిర్వహించగా వాసు అనే వ్యక్తిని అదృష్టం వరించింది.
- ఒక్కో దుకాణానికి కొందరు భారీ ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. ఒకే వ్యక్తి పేరిట ఎన్ని అప్లికేషన్లనైనా వేసుకోవచ్చని ఉండటంతో స్నేహితులు, కూటమి, సిండికేట్లుగా కొందరు 30 నుంచి 40 వరకు దరఖాస్తు చేసుకున్నారు. కొందరికి మూడు వరకు దుకాణాలు రాగా, మరికొందరికి ఒక్కటి కూడా రాలేదు.
- వెదురుకుప్పంలోని ఓ దుకాణానికి తిరుపతికి చెందిన వ్యక్తి ఒకే ఒక్క దరఖాస్తు వేయగా, లాటరీలో అతనికే దుకాణం వచ్చింది. మరెక్కడా కూడా ఇతను అప్లికేషన్ వేయలేదు. అప్పటికే అక్కడున్న వ్యాపారులు రూ.30 లక్షల వరకు ఇస్తామని, దుకాణం ఇచ్చేయాలని ఆఫర్ పెట్టినా అతను వద్దంటూ తిరస్కరించాడు.
- కర్ణాటకలోని హసన్‌కు చెందిన సంతోష్ అనే వ్యక్తి దాదాపు 22 దుకాణాలకు టెండర్లు వేస్తే.. గుడిపాలలోని ఒక్క దుకాణం వచ్చింది.
- కర్ణాటక సంగిలి సమీపంలో ఉన్న దుర్గాప్రసాద్‌కు పలమనేరులో ఓ దుకాణం వచ్చింది.

దోపిడీకే కొత్త లిక్కర్ పాలసీ



“ ఏపీలో కొత్తలిక్కర్‌పాలసీ పేరిట కూటమి ప్రభుత్వం దోపిడీ కోసమే ప్లాన్ చేస్తోంది. ఇసుక ఉచితమంటూ ఇప్పుడు ప్రైవేటు వారికి అప్పగిస్తోంది. ప్రైవేటు మద్యం దుకాణాలన్నీ కూటమి వారే పొందేలా ఓ పథకం ప్రకారం చేశారు. వేరే వారికి వచ్చిన షాపులను సైతం బెదిరించి కూటమి నేతలే పొందడం వాస్తవం కాదా?. ఈ ప్రభుత్వం రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేసింది. కేవలం అధికార పార్టీ వారు సంపాదించుకోవడానికే ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. దీనిపై ప్రజల్లో ఆగ్రహం కలిగి వారే ఎదిరించే రోజులు దగ్గర్లో ఉన్నాయి.

– వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే, పలమనేరు

జగనన్న కాలనీలో తమ్ముళ్ల దురాక్రమణ



లక్ష్మీపురంలో పునాదులు వేసిన ఇంటి వద్ద పట్టా చూపుతున్న సుగుణ

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన కొంత మంది ఆగడాలు మితిమీరిపోతున్నాయి. బీసీ మహిళలకు కేటాయించిన జగనన్న కాలనీలో స్థలంతోపాటు ప్రభుత్వ నిధులతో లబ్ధిదారు వేసిన పునాదులను సైతం ఆక్రమించుకుంటున్న సంఘటన పుంగనూరు మండలం రాంపల్లె, లక్ష్మీపురం, గూడూరుపల్లెలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పుంగనూరుకు చెందిన బి.సుగుణ అనే మహిళకు లక్ష్మీపురం కాలనీలో సర్వే నంబరు 45లో ప్లాట్ నంబరు1తో ఇంటి పట్టా మంజూరైంది. ఈ మేరకు లబ్ధిదారు సుగుణకు గృహరుణం కూడా మంజూరైంది. ప్రభుత్వం 40 బస్తాల సిమెంటు ఇవ్వడంతో ఆమె పునాదులు వేసింది. ఇందుకు గాను ప్రభుత్వం రూ.34,960 బిల్లు మంజూరు చేసింది. ఇది ఇలా ఉండగా ఆ స్థలం తమదంటూ ఆ ప్రాంతానికి చెందిన తెలుగుదేశం నాయకులు ఆమెను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేయడంతో ఆమె స్థానిక అధికారులు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీనిపై తక్షణం చర్యలు తీసుకుని, లబ్ధిదారులకు చెందిన స్థలాలు, పునాదులు దురాక్రమణ కాకుండ చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సంఘమిత్ర మార్పుపై వివాదం

- వీఓ సమావేశాన్ని బహిష్కరించిన సభ్యులు

చౌడేపల్లె: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చిన్నపాటి ఉద్యోగులపై రాజకీయ నాయకుల పెత్తనం, అధికారుల అండతో ఉద్యోగుల పొట్ట కొడుతున్నారు. ఇందుకు నిదర్శనం సోమవారం ఏ.కొత్తకోట గ్రామ సమాఖ్య సమావేశమే నిదర్శంగా నిలిచింది. వివరాల్లోకి వెళితే.. ఏ.కొత్తకోట వీఓ-2 సంఘమిత్రగా సుహాసిని 10 ఏళ్లుగా విధులు నిర్వహిస్తోంది. ఈ సమాఖ్య పరిధిలో 29 మహిళా సంఘాలు ఉన్నాయి. ఈమెను తొలగించి వసంతను నియమించాలని గ్రామ సమాఖ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఏపీఎం సుబ్రమణ్యం, సీసీ శ్రీనివాసులు, మహిళా సంఘాల సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. సంఘమిత్ర సుహాసినిన తొలగించి కొత్తగా వసంతను నియమిస్తామని అధికారులు తెలపగా సభ్యులు సమావేశాన్ని బహిష్కరించి అధికారుల తీరుపై మండిపడ్డారు. పాత సంఘమిత్రనే కొనసాగించాలని సభ్యులు పట్టుపట్టారు. లేకుంటే గ్రామ సమాఖ్యను రద్దు చేయాలని, సంఘాలకు సైతం ఇచ్చిన అప్పులు చెల్లించేది లేదని సభ్యులు హెచ్చరించారు. కాగా వసంత సంతకాన్ని ఫోర్జరీ చేసి గంగాభవానీ స్వయం సహాయక మహిళా సంఘంలో నిధులు సంఘమిత్ర స్వాహా చేసిందని ఆరోపణలు చేసిందని, అసలు సంఘం సమావేశానికే ఆమె రాదని ఆ సంఘంలోని సభ్యులే మాట్లాడడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. వీఓ సమావేశం వివాదంగా మారడంతో అధికారులు గ్రామసమాఖ్య సమావేశం పుస్తకాలు ఇవ్వాలని, ఆడిట్ నిర్వహించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకొంటామని అధికారులు చెప్పడం గమనార్హం.



ఏ.కొత్తకోటలో గ్రామ సమాఖ్య సమావేశం బహిష్కరించి ఏపీఎంను నిలదీస్తున్న సభ్యులు

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

చిత్తూరు కార్పొరేషన్: తుపానుపై విద్యుత్‌శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు ఆదేశించారు. సోమవారం రూరల్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. విద్యుత్ సమస్యలపై జిల్లాలోని పది విద్యుత్ డివిజన్లలో పది కంట్రోల్ రూమ్‌లు జిల్లా కేంద్రంగా ఒక కంట్రోల్ రూమ్‌తో కలిపి మొత్తం 11 కంట్రోల్ రూములను ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సమస్యలపై ఈ కంట్రోల్ రూమ్‌కి కాల్ చేయాలన్నారు. తిరుపతి జిల్లా కంట్రోల్ రూమ్ 9440817412, తిరుపతి టౌన్ డివిజన్ 9440817413, తిరుపతి రూరల్ డివిజన్ 9491052934, రెస్కో కుప్పం 1800425505505, పుత్తూరు డివిజన్ 8143773436, చిత్తూరు టౌన్ డివిజన్ 9440817419, చిత్తూరు రూరల్ డివిజన్ 9491052934, మదనపల్లె డివిజన్ 7382623216, పీలేరు డివిజన్ 9491054705, పుంగనూరు డివిజన్ 8074051992, నాయుడు పేట డివిజన్ 9553111354, గూడూరు డివిజన్ 9440811988 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. అలాగే సెక్షన్‌కు 100 పోల్స్‌ను నిల్వ ఉంచుకున్నామన్నారు. అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాల వ్యవసాయానికి వాడే 100 ట్రాన్స్‌ఫార్మర్లు తెప్పించామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాల్లో సకాలంలో పనులు చేసి ఇవ్వనున్నారన్నారు. లోతట్టు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వాడకానికి 40 జనరేటర్లు సిద్ధంగా ఉంచామన్నారు. సమస్య వస్తే వినియోగదారులు సొంతంగా లైన్, ఫ్యూజ్, ఇతర విద్యుత్ పరికరాలను మరమ్మతు చేయవద్దని సూచించారు. సంబంధిత ఏఈ, సబ్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

సంతృప్తినిచ్చింది

చిత్తూరు జిల్లాకు సర్కిల్(జిల్లా) కార్యాలయం కేటాయించడంతో మంగళవారం నూతన ఎస్ఈ బాధ్యతలు తీసుకొనున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఎస్ఈగా పనిచేసిన కాలం సంతృప్తి నిచ్చిందన్నారు. నాలుగు నెలల ముందు బాధ్యతలు తీసుకొని పలు మార్పులు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో లైన్ల సర్వే చేయించామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్, ట్రిప్పింగ్స్ తగ్గించామన్నారు. సబ్‌స్టేషన్ల నిర్వహణ, మరమ్మతు పనులు చేయించి అక్కడ రిజిస్టర్ పెట్టి ఫిర్యాదులు నమోదు చేయించామన్నారు. అలాగే ప్రతి బుధవారం డివిజన్ కార్యాలయాలలో గ్రీవెన్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈఈలు సురేష్, మునిచంద్ర, డీఈలు ప్రసాద్, శేషాద్రి, ఆనంద్, బాలాజీ, సుబ్రమణ్యం, పాల్గొన్నారు.

ఉజ్వల భవితకు నవోదయం

మా బిడ్డలు ఉన్నతంగా చదవాలి..వారి భవిత ఉజ్వలంగా ఉండాలి.. ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నది తల్లిదండ్రుల కల. అలాంటి గ్రామీణ ప్రాంతాల్లోని మధ్యతరగతి తల్లిండ్రుల కలలు సాకారం చేయడానికి ఏర్పాటైనదే జవహర్ నవోదయ విద్యాలయం. పేదల ఆశలు నెరవేరుస్తోన్న జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. పల్లెల్లోని ప్రతిభావంతులకు ఇది సువర్ణ అవకాశం.

- నవోదయలో అడ్మిషన్లకు వేళాయే
- 2025-26 విద్యాసంవత్సరంలో మిగులు సీట్లకు ప్రకటన
- 9,11 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం
- నవోదయ విద్యాలయలో సకల వసతులు
- అడ్మిషన్లపై అవగాహన కల్పిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లెకు సమీపంలో ఉన్న వలసపల్లిలో 1986లో నెలకొల్పిన జవహర్ నవోదయ విద్యాలయం వేలాది మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది వారు ఎంచుకున్న రంగాల్లో స్థిర పడేందుకు దోహదపడింది. అక్కడ అడ్మిషన్‌కు వేళైంది.

విద్యార్థులకు బోధనాంశాలివీ..

వలసపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా నైపుణ్యాలు, దేశభక్తి, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వంటి శిక్షణలు ఇస్తున్నారు. ప్రతిష్టాత్మక ఐఐటీ, జేఈఈ, నీట్ , యూపీఎస్సీ, ట్రిపుల్ ఐటీ వంటి విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందేలా సన్నద్ధం చేస్తున్నారు.



వలసపల్లి జవహర్ నవోదయ పాఠశాల

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి 9, 11వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ప్రకటన వెలువడింది.

9వ తరగతిలో ఎంపిక పరీక్ష ఇలా..

2025-26 విద్యాసంవత్సరానికిగాను ప్రవేశపరీక్ష నిర్వహించి తొమ్మిదో తరగతిలో అడ్మిషన్లు కల్పించనున్నారు. ఇందుకు నోటిఫికేషన్ సైతం ఇటీవల విడుదల చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు కలిగిన పాఠశాలల్లో చదివి ఉండాలని అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రవేశ పరీక్షలో ప్రధానంగా హిందీ, ఇంగ్లిషు, గణితం, సైన్స్ సబ్జెక్ట్‌లోని ప్రశ్నలు ఉంటాయి. ఓఎంఆర్ ఆధారిత అబ్జెక్టివ్ రకం, ద్విభాషా ప్రశ్నపత్రం (హిందీ, ఆంగ్లం)లో ఉంటుంది.

రాత పరీక్ష ద్వారా ఖాళీలు భర్తీ చేయనున్నారు. 9,11వ తరగతుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. తొమ్మిదో తరగతిలో చేరేందుకు ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2010 మే ఒకటి నుంచి 2012 జూలై 31 తేదీ మధ్య జన్మించి ఉండాలి. ఇంటర్‌లో చేరే విద్యార్థులు ప్రస్తుతం పదో తరగతి చదువుతూ 2008 జూన్ ఒకటి నుంచి 2010 జూలై 31వ తేదీ మధ్య జన్మించిన వారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన వారితోపాటు అన్ని కేటగిరీల విద్యార్థులకు ఈ నిబంధన వర్తిస్తుంది. విద్యార్థులు అక్టోబర్ 31లోగా నవోదయ విద్యాలయ వెబ్ సైట్ www. navodaya.gov.in ద్వారా దరఖాస్తు పూర్తి చేయాలి. అడ్మిషన్లు చేసుకునే విద్యార్థులకు 2025 ఫిబ్రవరి 8వ తేదీన చిత్తూరులో రాతపరీక్ష నిర్వహిస్తారు.

ఇంటర్ 11వ తరగతిలో ప్రవేశానికి..

పదోతరగతి పూర్తి చేసి ఇంటర్ 11వ తరగతిలో చేరాలనుకునే విద్యార్థులు మానసిక సామర్థ్యం, ఇంగ్లిషు, గణితం, సైన్స్, సోషల్ సైన్స్‌లో ప్రావీణ్యం ఉండాలి. ఓఎంఆర్ ఆధారిత అబ్జెక్టివ్ రకం పేపర్ ఉంటుంది. ద్విభాషా ప్రశ్నపత్రం (హిందీ, ఆంగ్లం) ఉంటుంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసి ఉండాలి.

క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం



“ వలసపల్లి నవోదయ విద్యాలయంలో వచ్చే విద్యాసంవత్సరం అడ్మిషన్ల అంశంపై క్షేత్రస్థాయిలో విద్యార్థులు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. ఈ నెల 31 వ తేదీ వరకు ఆసక్తి ఉన్న వారు అడ్మిషన్లు చేసుకోవచ్చు. వచ్చే ఏడాది కోసం 9, 11వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీ కోసం ప్రకటన విడుదల చేశారు. ప్రవేశాలు నియమ, నిబంధనల ప్రకారం నిర్వహిస్తారు. ప్రవేశాల కోసం దళారులను ఆశ్రయించొద్దు. ఎవరైనా సీటు ఇప్పిస్తామని మభ్య పెడితే ఫిర్యాదు చేయాలి. నవోదయలో విద్యనభ్యసించిన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. ఈ అవకాశాన్ని చిత్తూరు జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– దేవరాజు, డీఈఓ, చిత్తూరు జిల్లా

క్లుప్తంగా

పంటలపై ఏనుగుల దాడి

కల్లూరు(పులిచెర్ల): మండలంలోని అయ్యావాండ్లపల్లె పంచాయతీలో సోమవారం తెల్ల వారుజామున పంటలపై ఏనుగుల గుంపు దాడి చేసి ధ్వంసం చేశాయి. కోత కొచ్చిన వరిపంటను తొక్కి నాశనం చేయడంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. మండలంలో ఎక్కడో ఒకచోట ఈ ఏనుగులు పంటలపై దాడి చేస్తూనే ఉన్నాయి. సంబంధిత అధికారులు తగుచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అంతర్‌జిల్లా మిక్స్‌డ్ రిలేలో నగరి విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

నగరి : తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో జరిగిన 37వ అంతర్‌జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–20 విభాగంలో నగరి ప్రభుత్వ డిగ్రీకళాశాలకు చెందిన పి.జగదీష్ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. 4 (400) మీటర్ల మిక్స్‌డ్ రిలే పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. కళాశాలలో బీకాం (సీఏ) 3వ సంవత్సరం చదువుతున్న జగదీష్‌ను కళాశాల ప్రిన్సిపల్‌తోపాటు వైస్ ప్రిన్సిపల్ డా.భాస్కర్‌రాజు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హెడ్ రెడ్డినాయక్, పీడీ సి.ప్రేమ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో వస్తు సామగ్రి దగ్ధం


షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన వస్తువులు

పలమనేరు: పట్టణంలోని జెండామఠం వీధిలోని ఓ ఇంట్లో ఆదివారం రాత్రి జరిగిన షార్ట్ సర్క్యూట్ కారణంగా వస్తువులు కాలిపోయాయి. జెండా మఠం వీధిలోని ఆరీఫ్ అనే వ్యక్తి ఇంట్లో ఉన్నట్టుండి భారీ శబ్దం వచ్చింది. ఆ వెంటనే మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లోని వాషింగ్ మిషన్, ఫ్రిడ్జ్, ఫ్యాన్లు, గృహోపకరణాలు కాలిపోయాయి. స్పందించిన స్థానికులు మంటలను ఆర్పేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి, నీళ్లు కొట్టి ఎలాంటి ప్రమాదం లేకుండా చేశారు. ఈ సంఘటనలో రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

ఊరిస్తోంది!

ఆ పంచాయతీనే ప్రత్యేకం.. రికార్డుల్లో చెదరని సంతకం ఆ పల్లెది.. ఆ గ్రామానికి సర్పంచ్, కార్యదర్శి, వీఆర్వో, ఎంపీటీసీ సభ్యులు అందరూ ఉంటారు.. ఇదేమీ కొత్తకాదే అనుకుంటున్నారా.. అక్కడే వేశారు తప్పులో కాలు.. ఇవన్నీ పొరుగూరిలోనే.. ఆ ఊరే ఉండదు.. జనమే లేరు.. ఆ పల్లె పేరుకే పరిమితమై ఊరిస్తోంది.. అదే పలమనేరు మండలం బయప్పగారిపల్లె పంచాయతీ.

- బ్రిటీషర్ల పాలనలో అంటువ్యాధులు ప్రబలి వలస పోయిన గ్రామం
- రికార్డులకే పరిమితమైన బయప్పగారిపల్లె
- గ్రామం కనుమరుగైనా ఇప్పటికీ అదే పేరిట పాలనా వ్యవహారాలు


బయప్పగారిపల్లె పేరిట ప్రస్తుతం పరిపాలన సాగుతున్న మండీపేట కోటూరు

పలమనేరు: సుమారు వందేళ్ల క్రితం కాలువపల్లెకు దక్షిణ దిశగా ప్రస్తుతం గుడియాత్తం రోడ్డుకు ఆనుకుని వున్న బ్రిటీష్ బంగ్లాకు వెనుక వైపు ఈ బయప్పగారిపల్లె ఉండేది. ఈ గ్రామం చుట్టూ 16 చిన్న చిన్న పల్లెలు ఉండేవి.ఈ గ్రామం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉండేది. అప్పట్లో బ్రిటీషర్లు ఇక్కడ ఓ అతిథి గృహాన్ని సైతం నిర్మించారు. పూర్తిగా అటవీప్రాంతం కావడంతో మద్రాసు నుంచి ఇటువైపు వచ్చేవారు ఈ గృహంతో విడిది చేసేవారు. అలాగే తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారే ఎక్కువమంది నివాసం ఉండేవాళ్లు.

పేరుకే ఆ పల్లె పరిమితం

గ్రామానికి సంబంధించి అప్పట్లో ఓ గుడి ఉండేది. ప్లేగు, కలరా లాంటి అంటువ్యాధులు ప్రబలి పెద్ద సంఖ్యలో గ్రామస్తులు మృతి చెందడంతో గ్రామంలోని ఇళ్లు, వాకిళ్లు వదిలి తక్కినవారు వలసబాట పట్టడంతో ఒక్కరంటే ఒక్కరూ లేక కాలక్రమంలో ఈ గ్రామం కనుమరుగైంది. ప్రస్తుతం శిథిలమైన ఇళ్లు..మొండి మట్టిగోడలు..అప్పటి ప్రజలు వాడిన వస్తువులు తెరమరుగైన గ్రామం ఉనికిని చెబుతుంటాయి. ఈ గ్రామానికి వెళ్లే దారి పూర్తి చెట్లతో మూసుకుపోయి ఉంది. గతంలో గ్రామం ఉన్న ప్రాంతంలో ఇప్పుడు మామిడి తోపులున్నాయి. అక్కడ పొలాలు తప్ప మరేమీ కన్పించవు. ఊరికి ఆనుకుని వున్న చెరువు మాత్రం ఇప్పటికీ అలాగే వుంది. గ్రామ పొలిమేర్లలో ఓ నరసింహస్వామి ఆలయం, శివాలయం పాడుబడి ఉన్నాయి. దొమ్మర పాపమ్మ గుడి మాత్రం ఇప్పటికీ మంచి ప్రాశస్త్యం పొందింది. అయితే బయప్పగారిపల్లె పేరు రికార్డులో ఉండడం మూలాన ఆ పేరుతోనే అన్ని లావాదేవీలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. దీంతో పలమనేరు మండలానికి కొత్తగా వచ్చే అధికారులు, ప్రజలు ఇప్పటికీ బయప్పగారిపల్లె ఉందని భావిస్తుంటారు.

బయప్పగారిపల్లె పరిపాలన మండీపేట కోటూరులో..

బయప్పగారిపల్లె గ్రామం కనుమరుగైనా ఈ పంచాయతీకి సంబంధించిన పరిపాలన ఈ గ్రామానికి సమీపంలోని మండీపేట కోటూరులో ప్రస్తుతం సాగుతోంది. గ్రామంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, రెవెన్యూ రికార్డుల్లోనూ బయప్పగారిపల్లె పేరిటే ఉన్నాయి. ప్రస్తుతం ఈ గ్రామంలో సుమారు 850 ఇండ్లు వున్నాయి. 4 వేల దాకా జనాభా ఉంది.

రికార్డుల్లో ఇప్పటికీ బయప్పగారిపల్లే



మండలంలోని బయప్పగారిపల్లె పంచాయతీ కేంద్రంగా ఇప్పటికీ అన్ని రికార్డుల్లో ఉంది. బ్రిటీషర్ల హయాం నుంచి ఇదే విధంగా ఉంది. మండలానికి ఇప్పుడు కొత్తగా వచ్చిన అధికారులకు సైతం బయప్పగారిపల్లె గురించి తెలియదు. ఇలాంటి గ్రామాలు జిల్లాలో అక్కడక్కడా వున్నా వాటి గురించి చాలా మందికి తెలియదు. ఇలాంటి గ్రామాల గురించి, వాటి చరిత్ర గురించి ఇప్పటి తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–బాలాజీనాయుడు, గ్రామ పెద్ద, బయ్యప్పగారిపల్లి

ఊరులేని ఊరికి సర్పంచ్‌గా పనిచేశా



నేను బయప్పగారిపల్లె మాజీ సర్పంచ్‌ని. కానీ బయప్పగారిపల్లె ఊరు మా తాతముత్తాతల కాలంలో గ్రామం ఉండేదట! కానీ ఇప్పుడు అక్కడ ఆ నాటి గుర్తులు తప్ప ఇంకేమీ కనపడవు. మండీ పేట కోటూరులో పంచాయతీ కార్యకలాపాలన్నీ జరుగుతున్నాయి. ఇలా ఊరులేని ఊరికి సర్పంచ్‌గా పనిచేశానని నాకు గొప్పగానే ఉంటుంది.

–హరిక్రిష్ణ, బయప్పగారిపల్లె మాజీ సర్పంచ్


బయప్పగారిపల్లెలో మిగిలిన ఇళ్ల ఆనవాళ్లు


అప్పట్లో ఉన్న గ్రామానికి వెళ్లే దారి

రూ. 30 లక్షలకు ఐపీ దాఖలు

నదుం: మండల కేంద్రంలోని వీఆర్‌ఆర్ కాలనీకి చెందిన బోయకొండ అనే వ్యక్తి రూ.30 లక్షలకు పీలేరు కోర్టులో ఐపీ దాఖలు చేసినట్లు లాయర్ షౌకత్ అలీ సోమవారం తెలిపారు. వీఆర్‌ఆర్ కాలనీకి చెందిన ముగ్గురు వద్ద వ్యాపార అవసరాల కోసం అప్పు చేసినట్లు, వ్యాపారంలో నష్టం రావడంతో ఐపీ దాఖలు చేస్తున్నట్లు అందులో పేర్కొన్నట్టు చెప్పారు. తన వద్ద రూ. 2 వేలు విలువ చేసే దుస్తులు మాత్రమే ఉన్నాయన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : అధిక వర్షాల కారణంతో ఈ నెల 15వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మంగళవారం నాటికి వాయిదా వేసిన విషయం విదితమే. అయితే అధిక వర్షాల కారణంగా ఈ వారం ఆ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించి, జిల్లా కేంద్రానికి వ్యయప్రయాసలకోర్చి రాకూడదన్నారు. వచ్చే వారం నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యల వినతులను అందజేయాలని కలెక్టర్ కోరారు.

నేడు పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే

చిత్తూరు అర్బన్: నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో మంగళవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

13 మండలాల్లో ఊసేలేని పల్లె పండుగ

- సీఎం ఇలాకాలో తూతూమంత్రంగా కార్యక్రమం
- మొదటి రోజు 51 గ్రామాల్లో నిర్వహణ


చిత్తూరు రూరల్‌లో పల్లె పండుగ పబ్లిసిటీలో కూటమి ప్రజాప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్ : పంచాయతీల అభివృద్ధి కోసం అమలు చేసిన పల్లెపండుగ కార్యక్రమం 13 మండలాల్లో నామ మాత్రంగా కూడా నిర్వహించలేదు. పల్లె పండుగ వారోత్సవాల పేరుతో కూటమి సర్కారు నిర్వహిస్తున్న కార్యక్రమం తొలిరోజు తూతూమంత్రంగా సాగింది. ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా తొలిరోజు అన్ని మండలాల్లో నిర్వహించాల్సి ఉంది. అయితే అలా జరగలేదు. తొలిరోజు జిల్లాలోని 13 మండలాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించలేదు. పల్లె పండుగ పేరుతో కూటమి సర్కారు చేస్తున్న హడావుడికి క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉంది. క్షేత్రస్థాయిలో కార్యక్రమానికి వెళుతున్న కూటమి ఎమ్మెల్యేలను సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు ప్రజాప్రతినిధుల నుంచి సరైన సమాధానాలు రావడం లేదు. చిత్తూరు రూరల్ మండలంలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొన్న చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు త్వరలోనే అమలు చేస్తామని గొప్పలు చెప్పారు. దీపావళికి ప్రజలకు ఉచిత సిలిండర్ పథకం అమలు చేస్తామని చెప్పడంతో అమలు చేసే వరకు నమ్మకం లేదని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అలాగే నగరి, పలమనేరు, పూతలపట్టు, చిత్తూరు, కుప్పం నియోజకవర్గాల్లో సాగిన పల్లె పండుగ కార్యక్రమాన్ని కూటమి నాయకులు పార్టీ కార్యక్రమంలా నిర్వహించడంతో విమర్శలు గుప్పుమన్నాయి.

మొదటి రోజు 51 గ్రామాల్లో మాత్రమే....

కూటమి ప్రభుత్వం ఆర్భాటం చేసిన పల్లె పండుగ కార్యక్రమం జిల్లాలో తొలిరోజు విజయవంతం కాలేదు. జిల్లా వ్యాప్తంగా 700 గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. కాగా మొదటి రోజు కేవలం 51 గ్రామాల్లో మాత్రం కార్యక్రమం నిర్వహించి మమ అనిపించారు. గంగాధరనెల్లూరు, పాలసముద్రం, పెనుమూరు, తవణంపల్లి, బైరెడ్డిపల్లె, కుప్పం, శాంతిపురం, వి.కోట, బంగారుపాళెం, చౌడేపల్లి, పెద్దపంజాణి, పుంగనూరు, పూతలపట్టు మండలాల్లో ఒక్క గ్రామంలో కూడా తొలిరోజు పల్లె పండుగ నిర్వహించలేదు. ఈ పరిస్థితిని చూస్తే పల్లె పండుగను కూటమి ప్రభుత్వం ఏ విధంగా నిర్వహిస్తోందో అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని మరిచి పబ్లిసిటీ కోసం పల్లె పండగ వారోత్సవాలు నిర్వహిస్తోందని క్షేత్రస్థాయిలో ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

కారు బోల్తా.. ఒకరి మృతి

- ముగ్గురికి గాయాలు


జమీర్ అహ్మద్ మృతదేహం


పొలాల్లో బోల్తా పడిన కారు

శాంతిపురం: కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఒక దుర్మరణం చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. శాంతిపురం మండలం, కడపల్లి సమీపంలో ఆదివారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. రాళ్లబూదుగూరు పోలీసుల కథనం మేరకు.. రాళ్లబూదుగూరు గ్రామానికి చెందిన జమీర్ అహ్మద్, మహ్మమద్, సిద్ధిఖీ తమిళనాడు రాష్ట్రానికి చెందిన స్నేహితులు లోకేష్, తరుణ్‌తో కలిసి కుప్పం పట్టణానికి బయలుదేరారు. మార్గం మధ్య కడపల్లి వద్ద వెళుతుండగా కారు అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీ కొని పక్కనే ఉన్న పొలాల్లో బోల్తా పడింది. ప్రమాదంలో జమీర్ అహ్మద్ అక్కడికక్కడే మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108లో కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో మహమ్మద్ సిద్ధిఖీ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య సేవల నిమిత్తం తిరుపతికి తరలించారు. మిగిలిన వారు కుప్పం పీఈఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

మహిళకు తీవ్ర గాయాలు

పుంగనూరు: గుర్తుతెలియన వాహనం ఢీకొని మహిళకు గాయాలయ్యాయి. మండలంలోని గూడూరుపల్లె చెందిన లేట్ నాగప్ప భార్య ఆదెమ్మ(65)కు మతి స్థిమితం లేదు. ఈమె భీమగానిపల్లె వద్ద నడిచి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రురాలిని ఆ ప్రాంతవాసులు 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 86,900 మంది స్వామివారిని దర్శించుకోగా 28,739 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.56 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కలెక్టర్‌తో జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి భేటీ


కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న రాఘవులు

చిత్తూరు కలెక్టరేట్ : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రాఘవులు సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం జిల్లాలో సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయం అద్దె భవనంలో ఉందని తెలిపారు. పాత కలెక్టరేట్‌లో ఉన్న శాఖల్లో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయానికి భవనం కేటాయించాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి భవనం కేటాయింపునకు అనుమతి ఇచ్చారని తెలిపారు.

ముందస్తు ఏర్పాట్లు సిద్ధం

- క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లాలో ఈ నెల 15,16 తేదీల్లో భారీ వర్షాల హెచ్చరిక
- అధికారుల సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అధిక వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో సహాయక చర్యలకు అవసరమైన ముందస్తు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో అన్ని శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి, ఆదేశాలు జారీచేశారు. కలెక్టర్ మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఈ నెల 15,16 తేదీల్లో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిందన్నారు. జిల్లాలో మండలాల వారీగా చెరువులు, కట్టలు, వాగులు, కాలువల పరిరక్షణపై దృష్టి పెట్టాలన్నారు. వాగులు, కాలువలు దాటే సమయంలో ఎలాంటి నష్టం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 9491077356 నంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు. కంట్రోల్ రూమ్ వర్షాలు తగ్గే వరకు షిఫ్టుల వారీగా పనిచేస్తుందన్నారు. వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగు చేసే రైతులను అప్రమత్తం చేయాలని చెప్పారు. పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు తెలియజేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

పశునష్టం తలెత్తకుండా చర్యలు తీసుకోండి

జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఎక్కడా పశునష్టం సంభవించకుండా చర్యలు చేపట్టాలని పశుసంవర్ధకశాఖ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా విద్యుత్ అంతరాయం తలెత్తితే విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి పునరుద్ధరణ పనులు నిర్వహించాలన్నారు. జాతీయ రహదారుల వెంట వర్షాలతో చెట్లు విరిగి పడితే ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా అధికారి కేడర్ నుంచి నియోజకవర్గ, మండల, సచివాలయ, గ్రామస్థాయి వరకు ప్రతి అధికారి సిబ్బంది ఆయా ప్రధాన కార్య స్థానాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఎటువంటి విపత్తు వచ్చే అవకాశం ఉన్న ముందస్తుగా ఉన్నతాధికారులకు సమాచారం అందించి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. విపత్తు సమయంలో ప్రతి అధికారి, సిబ్బంది మరింత బాధ్యతతో వారి విధులు నిర్వర్తించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని డాక్టర్లు పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని తెలిపారు. పూరి గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అక్కడ ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమీపంలోని పాఠశాలలు, కళాశాలలను పునరావాస కేంద్రాలుగా గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖకు చెందిన అధికారి, ఎంపీడీఓలు, తహసీల్దార్లు ముఖ్యమైన రికార్డులను సురక్షితమైన చోట భద్రపరచాలన్నారు. అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ఉన్న ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని చెప్పారు. వర్షాల కారణంగా ఈదురు గాలులతో ఫ్లెక్సీలతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

అవసరమైన సామగ్రిని సిద్ధం చేసుకోవాలి

సహాయక చర్యలకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేసుకోవాలని ఎస్పీ మణికంఠ తెలిపారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మండలాల వారీగా కల్వర్టులు, బ్రిడ్జిలు, కాజ్‌వేల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈదురు గాలులతో చెట్లు విరిగిపోవడం జరుగుతుందని వాటిని తొలగించడానికి అవసరమైన జేసీబీలు, సిబ్బంది, తదితర సామగ్రిని ముందస్తుగా అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి అధికారులు సమష్టిగా పనిచేసి విపత్తును ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో పీఆర్ ఎస్ఈ శంకర్‌నారాయణ, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి, డీఈఓ దేవరాజు, హౌసింగ్, డ్వామా పీడీలు పద్మనాభం, రవికుమార్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.